చేరువకానున్న వైద్యం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మండలవాసులు

- కేబినెట్ బేటీలో పీహెచ్‌సీ మంజూరు ప్రకటన
- హర్షం వ్యక్తం చేస్తున్న మండలవాసులు

సిరికొండ: గత ఎనిమిది సంవత్సరాల క్రితం నూతనంగా ఏర్పాటు చేసిన సిరికొండ మండలంలో గిరిజనులకు సరైన వైద్యం అందడం లేదు. అత్యవసరంగా వైద్యం అందించాలంటే మండల కేంద్రం నుంచి ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండలాలకు, లేకపోతే జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేసుకోవాలి. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగేది. సాక్షి వరుస కథనాలు, ప్రజాప్రతినిధుల చొరవతో గురువారం జరిగిన సీఎం కేబినేట్ బేటీలో మండలానికి పీహెచ్‌సీ మంజూరుపై ప్రకటన చేయడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అరచేతిలో ప్రాణాలు..


గాలిలో గిరిజనుల ప్రాణాలు

పీహెచ్‌సీ ఏర్పాటు గురించి సాక్షిలో వచ్చిన కథనం

నూతనంగా ఏర్పడిన మండలంలో 19 గ్రామ పంచాయతీలు, 52 గ్రామాలు ఉన్నాయి. గ్రామాల్లో అధిక గిరిజనులే ఉంటారు. మండలంలో పీహెచ్‌సీ లేక గ్రామం నుంచి ఇతర మండల కేంద్రాలకు వెళ్లేలోపు ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి. మండలం ఏర్పాటు అయిన తరువాత తమకు ప్రభుత్వ ఆసుపత్రి వస్తుందని ఎదురుచూసిన మండల ప్రజలకు ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి మంజూరుతో తిపి కబురు చెప్పినట్లు అయింది.

సాక్షి వరుస కథనాలు..

మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి లేక ప్రజలు పడుతున్న కష్టాలను సాక్షి వరుస కథనాలు ప్రచురించింది. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకువెళ్లింది. ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి మండలానికి పీహెచ్‌సీ మంజూరు చేశారు. దీంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోగం వస్తే దేవుడే దిక్కు..



మాది మండలంలోని బుర్సిగుట్ట గ్రామం. మాకు రోగం వస్తే సిరికొండ నుంచి ఇచ్చోడ, ఇంద్రవెల్లి దవాఖానాలకు పోవాల్సి వస్తుంది. దీంతో అప్పటి వరకు మాకు దేవుడే దిక్కు. ఇప్పుటు సిరికొండలో దవాఖానా ప్రభుత్వం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది.
– తోడసం జనాబాయి, బుర్సిగుట్ట

సంతోషంగా ఉంది



మండలానికి ప్రభుత్వ పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. గిరిజనులకు నాణ్యమైన వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత. మండలాలకు మంజూరు చేసిన పీహెచ్‌సీలను వెంటనే నిర్మించాలి.
– పెందుర్ అమృత్‌రావు, ఎంపీపీ

బీఆర్‌ఎస్ హయాంలో అన్నివర్గాలకు న్యాయం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ హయాంలో అన్నివర్గాలకు న్యాయం జరిగిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని 12 వార్డులకు సంబంధించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని శుక్రవారం ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని కొనియాడారు. దేశంలో ఎక్కడలేని సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, రావుత్ మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, జహురొద్దీన్ పాల్గొన్నారు.

బీసీల సంక్షేమం గాలికి..

ఆదిలాబాద్‌టౌన్: బీసీల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. దేశంలో 60 కోట్ల జనాభా ఉన్న బీసీల సంక్షేమం కోసం బీజేపీ చేసిందేమీ లేదన్నారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని తీర్మానం చేసి పంపినా.. ఇప్పటికీ స్పందన లేదన్నారు. బీజేపీ అంటేనే బీసీ వ్యతిరేక పార్టీ అని అభివర్ణించారు. ఆత్మ చైర్మన్ జిట్ట రమేశ్, ఎంపీపీ గండ్రత్ రమేశ్, వైస్ మార్కెట్ చైర్మన్ బొమ్మ కంటి రమేశ్, జంగు పటేల్, గంగారెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

ఆదిలాబాద్: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ బండారి సతీశ్, ఏకేఎస్ అధ్యక్షుడు అధిత్య ఖండేష్కర్, ప్రమోద్ ఖత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థులు ఎంపిక

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ ఆదర్శ పాఠశాలకు చెందిన 27 మంది విద్యార్థులు నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుధారాణి తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు రూ. 12వేల చొప్పున నాలులు సంవత్సరాల పాటు పొందవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థులను ఆమె అభినందించారు.

ఇచ్చోడ: నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్‌కు ఇచ్చోడ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ ఉదయ్‌రావు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఇచ్చోడ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న రుద్ర, జయవర్ధన్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రతిభ గల పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆదిలాబాద్‌టౌన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఆదిలాబాద్ పట్టణంలోని రణదివ్యనగర్ జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూపతి రెడ్డి తెలిపారు. ఎస్.నివేదిత, ఆదిత్య, తలాండే ఘన్‌శ్యామ్, షేక్ రిజ్వాన్‌లు ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కత్తి శ్రీహరిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాంసి: నేషనల్ మీన్స్ కమ్‌మెరిట్ స్కాలర్‌షిప్‌కు నిపాని పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.కె.షాహింద్ ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం సంతోష్ తెలిపారు. శుక్రవారం సర్పంచ్ రాజన్న, హెచ్‌ఎం గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

బోథ్: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ సురేందర్ అన్నారు. శుక్రవారం బోథ్ పట్టణంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్‌సింగ్, ఎంపీవో జీవన్‌రెడ్డి, జాదవ్ సంపత్, పంచాయతీ కార్యదర్శి అంజయ్య, వెంకటేశ్, ఆత్మ చైర్మన్ మల్లెపూల సుభాష్, రమణ గౌడ్ పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

రేపు ప్రవేశ పరీక్ష

ఆదిలాబాద్‌రూరల్: పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఐదు నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, అందులో భాగంగానే ఈనెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత కుమారి, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నలంద డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం..

ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో వివిధ పోటీ పరీక్షల తరగతులు బోధించేందుకు లెక్చరర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీతకుమారి తెలిపారు. ఐదు నెలల పాటు ఫౌండేషన్ కోర్సులో ఇంగ్లీష్, అర్థోమెటిక్, రీజనింగ్, జాగ్రఫీ, పాలిటి, సోషియాలజీ, చరిత్ర, తెలంగాణ ఉద్యమ చరిత్ర, కరెంట్ అఫైర్స్, అర్థశాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, సైన్స్ అండ్ టెక్నాలజిలలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఆసక్తిగల వారు ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్యాటరింగ్ కోసం..

ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో ఐదు నెలల పాటు అందజేయనున్న ఫౌండేషన్ కోర్సులో భాగంగా వంద మంది విద్యార్థులకు భోజన సౌకర్యం కోసం క్యాటరింగ్ యజమానుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీతకుమారి, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ రమేశ్‌లు తెలిపారు. ఉదయం టిఫిన్‌లో పూరి, వడ, ఇడ్లి, బోండా, పులిహోర, ఖిచిడి, ఉప్మా, మధ్యాహ్న భోజనంలో వైట్ రైస్, వెజిటెబుల్ కర్రీ, దాల్, సాంబర్, పెరుగు, సాయంత్రం డిన్నర్‌లో వైట్ రైస్, వెజిటెబుల్ కర్రీ, దాల్, పెరుగుతో పాటు రెండు పూటలు టీ అందించాల్సి ఉంటుందని వివరించారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆదర్శ కళాశాలలో ప్రవేశానికి..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులలో 40 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం

బజార్‌హత్నూర్: మండలంలోని గోకొండ గ్రామానికి చెందిన బక్రి సీత శుక్రవారం ఉదయం పురిటి నొప్పులతో ఇబ్బంది పడుతుండడంతో 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్తుడంగా చింతలసాంగ్వీ గ్రామ సమీపంలో నొప్పులు ఎక్కువయ్యాయి. ఈఎంటీ గోపీ, పైలెట్ గుట్టే రాజారాంలు గర్భిణికి పురుడు పోశారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించనట్లు తెలిపారు.

సుందరయ్య ఆశయాలు నెరవేర్చాలి

ఎదులాపురం: భారత కార్మిక ఉద్యమ, స్వాతంత్ర్య సమర యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. సుందరయ్య 38వ వర్ధంతిని పురస్కరించుకుని సీఐటీయూ రిమ్స్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో శుక్రవారం సామూహిక సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఇందులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, దేవిదాస్, పొచ్చన్న, సుమన్‌తాయి, అరుణ్, హరీశ్, రమేశ్, ప్రశాంత్, రమాకాంత్, చందు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే సీసీ కెమెరాలు

ఆదిలాబాద్‌టౌన్: నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు దోహదపడతాయని ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరిలక్ష్మినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ప్రారంభించారు. కాలనీల్లో చిన్నపాటి చోరీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలను పట్టుకోవడం కష్టంగా మారిందన్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ పురుషోత్తం, ఎస్సైలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా సెక్టోరల్ అధికారి నారాయణ సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన యూడైస్ ప్లస్ పోర్టల్‌లో పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ప్రతివిద్యార్థి వివరాలు నమోదు చేయాలని మండల వనరుల కేంద్రం సిబ్బందికి సూచించారు. మండలంలోని శ్యాంపూర్, లక్కారం గ్రామాల్లోని పాఠశాల భవనాలను పరిశీలించారు. ఆయన వెంట సీఆర్పీ ధరంసింగ్, ఆపరేటర్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నార్నూర్: మండల కేంద్రంలోని బాలాజీగుట్టపై వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠించిన తర్వాత మొదటి శుక్రవారం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గోవింద నామస్మరణంతో మార్మోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, ఆలయ కమిటీ సభ్యులు విశ్వనాథ్, సురజ్‌సింగ్ బానోత్ పాల్గొన్నారు.

నర్సరీలపై దృష్టి సారించాలి

నార్నూర్: ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండాల, మహాగావ్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీలను సందర్శించి మొక్కలను పరిశీలించారు. ప్రతీ ఉపాధి కూలీకి పని కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రమేశ్, ఏపీవో సురేందర్ రాథోడ్ టీఏలు జాదవ్ కైలాస్‌నాయక్, జాదవ్ సచిన్ ఉన్నారు.

మాదిగలు తరలిరావాలి

గుడిహత్నూర్: జిల్లా కేంద్రంలో ఈనెల 29న నిర్వహించనున్న మాదిగ సంక్షేమ సంఘం భూమిపూజ కార్యక్రమానికి మాదిగలు వేలాదిగా తరలిరావాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చందెల రాజన్న పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నాగన్న, కోశాధికారి మల్యాల మనోజ్, నాయకులు దర్శనాల అశోక్, మల్యాల కరుణాకర్, సుంక రమేశ్, కె.మహేందర్, దుబ్బాక నరేశ్, తార రవి, సుద్దాల రాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నేరడిగొండ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కుమారి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రహ్మ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం బోరుబావి మంజూరు చేశారు. కమలాకర్ రెడ్డి, బ్రహ్మయ్య, జి.సంతోశ్, రాజేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో పాల్గొనండి

బోథ్: హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌లో భాగంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జూన్ 2న ఆన్‌లైన్‌లో నిర్వహించే క్విజ్ పోటీల్లో పాల్గొనాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు బాపురెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రమేశ్‌లు కోరారు. నియోజకవర్గంలో 40 బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. 76618 99899కు మిస్డ్‌కాల్ ఇస్తే రిజిస్ట్రేషన్ లింక్ వస్తుందన్నారు.

గడప గడపకూ వైఎస్సార్ టీపీ

ఆదిలాబాద్‌టౌన్: గడప గడపకూ వైఎస్సార్ తెలంగాణ పార్టీని తీసుకెళ్తామని ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని 31వ వార్డు అధ్యక్షుడిగా అస్లమ్ ఖాన్, 32వ వార్డు అధ్యక్షుడిగా ఆసిఫ్ ఖాన్‌ను నియమించారు. పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు షేక్ అస్లమ్, కృష్ణంరాజు, షాబాజ్, కృష్ణ, అజీమ్ ఖాన్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

ఎదులాపురం: బీఆర్‌ఎస్ నాయకులు అసత్యపు ఆరోపణలు మానుకోవాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గటిక క్రాంతికుమార్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ పేరు మీద 107 ఎకరాలు రైతుల నుంచి సేకరించే సమయంలో రైతుల దగ్గర తక్కువ ధరకే భూమి తీసుకుని, పట్టాకు ఒక ఇల్లు, రెండు వేల మందికి ఉద్యోగాలు ఇస్తామని మాయమాటలు చెప్పింది ఎవరో స్థానిక ప్రజలకు తెలుసని మండిపడ్డారు. కార్యక్రమంలో సంతోశ్, సోనేరావ్, సతీశ్, రాము, అశ్విన్, నరేశ్, ఆరీఫ్, ముఖీమ్, ఆనంద్, శివ, రుతిక్, పవన్ పాల్గొన్నారు.


ఓటరు జాబితాపై సమీక్ష

బోథ్: బోథ్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్ మండలాల్లో ఒకే ఇంటి నంబరులో ఆరు కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న వారి జాబితాపై ఓటర్ల నమోదు అధికారి కదం సురేశ్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఇంటి నంబరు తప్పుగా ఉంటే సవరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం: బీజేపీ పార్లమెంట్ సభ్యుడు బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మహిళా కుస్తీ యోధులపై లైంగిక వేధింపులను ఖండిస్తూ.. సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా మహిళా సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శుక్రవారం నిరసన చేపట్టారు. నాయకులు అన్నమొల్ల కిరణ్, లంకా రాఘవులు, బండి దత్తాత్రి, లంకా జామున, గంగన్న, దేవిదాస్, మంజుల, లలిత, రమాకాంత్, అరుణ్, స్వామి పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ దుర్గారాణి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లో జూన్ 10న నిర్వహించే లోక అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ దుర్గారాణి అన్నారు. శుక్రవారం ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల సీఐ, ఎస్సై, ఫారెస్టు అధికారులతో సమావేశం నిర్వహించారు. కేసులు ఉన్న వారు లోక్ అదాలత్‌లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్, న్యాయవాదులు జగన్, సీహెచ్ గిరి, రాజు, సీఐ సైదారావు ఎస్సై, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


తాంసి: స్వీట్లు పంచుతున్న వీఆర్‌ఏలు

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించిన సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల వీఆర్‌ఏలు శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బాపురావు, బొమ్మెత రమేశ్, పవన్, మేహరాజ్, ప్రదీప్, అర్వింద్, లక్ష్మీ, సాయేబ్‌రావ్, నరేశ్, ఆశతాయి, గంగాధర్, సల్మాన్, సుమ, గంగయ్య పాల్గొన్నారు.

బోథ్: వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేసి, పేస్కేల్ ఇచ్చినందుకు బోథ్ వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. జూన్ 2న జీఓ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు కుర్మెరందయ్య, ప్రధాన కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి దీటి ముత్యం, రాంచందర్, రాజేశ్వర్, కృష్ణ, శివరామ్, స్వామి పాల్గొన్నారు.

గుడిహత్నూర్: వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని సూచించిన సీఎం కేసీఆర్‌కు వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్నో ఏళ్లుగా కార్యాలయ బంట్లుగా పని చేస్తున్నామని, కేసీఆర్ గుర్తించి తగిన హోదా కల్పించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కాంబ్లే పుండలీక్, కాంబ్లే బాలాజీ, గజభరే విద్యాసాగర్, కేశవ్, కోవా లత, రాజన్న, దయానంద్, సాయన్న పాల్గొన్నారు.

తాంసి: సీఎం కేసీఆర్ వీఆర్‌ఏలకు క్రమబద్ధీకరించడంతో పాటు పేస్కేల్ వర్తింపజేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో మండల కేంద్రంలో వీఆర్‌ఏలు సంబురాలు జరుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తహసీల్దార్ శ్రీదేవికి, అధికారులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జీవన్, రాఘవేంద్ర, స్వాగత్, రాహుల్, నారాయణ, మహేందర్ పాల్గొన్నారు.

జీవవైవిధ్యంతోనే మానవ మనుగడ


ర్యాలీ నిర్వహిస్తున్న జీవవైవిధ్య సభ్యులు

ఇంద్రవెల్లి: జీవవైవిధ్యంతోనే మానవ మనుగడ సాధ్యమని జీవవైవిధ్య యజమాన్య మండలి జిల్లా కయార్డినేటర్ సోన్‌కాంబ్లే గోపీనాథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కోరెంగా గాంధారి, అధికారులతో కలిసి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి ప్రసాదించిన జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరెంగా గాంధారి, ఎంపీవో సంతోశ్‌కుమార్, పంచాయతీ ఈవో సంజీవ్‌రావు, ఐకేపీ సీసీ బామ్నే శ్రీరాం, అటవీశాఖ బీట్ ఆఫీసర్లు అరుణ్, రాజు, సంజీవ్ పాల్గొన్నారు.

పల్లెప్రగతి విజయవంతం చేయండి

ఇచ్చోడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతిలో ప్రతిఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ముఖరా(కె) సర్పంచ్ గాడ్గేమీనాక్షి కోరారు. శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పల్లెప్రగతి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. గ్రామస్తులంతా పచ్చదనం, పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగించవద్దని, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గాడ్గే సుభాష్, ఉప సర్పంచ్ వర్ష, తిరుపతి, మాధవ్, పురుషోత్తం పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఈనెల 20న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ అర్బన్ మండలంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డు, శాంతినగర్, కుమ్మరివాడ, పీహెచ్‌సీకాలనీ, బాలాజీనగర్, పాలిటెక్నిక్ కళాశాల, ఇండ్రస్ట్రియల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. గమనించి సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్‌రూరల్: జీఎస్‌నగర్ ఉప కేంద్రం 33/11 కేవీ మరమ్మతుల కారణంగా శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రాంపూర్, పొచ్చర, దిమ్మ, జందాపూర్, భీంసరి గ్రామాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్‌శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈవిషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలోని శ్రీ జగదాంబ దేవి, శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాల 11 వార్షిత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు మహా చండియాగం, భోగ్‌బండార్, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 21న బలిపూజ నిర్వహించడం జరుగుతుందన్నారు.

25న కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

బోథ్: మండలంలోని పొచ్చర క్రాస్ రోడ్డు సాయి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 25న సీపీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు పసుల చంటి తెలిపారు. కెరీర్ గైడెన్స్‌కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ కిరణ్ కుమార్, ఎస్సై రవీందర్, సొసైటీ సభ్యులు ఆవిష్కరించారు.

సంక్షిప్త వార్తలు

విరాళాలు సేకరణ

సిరికొండ: నాలుగు రోజుల క్రితం రెండు బైక్‌లు ఢీకొని తీవ్రంగా గాయపడిన ఇచ్చోడ మండలంలోని మాధపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ గ్రామీణ బ్యాంకు అటెండర్ నర్సయ్య హైదారాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద నర్సయ్యకు మెరుగైన చికిత్స అందించేందుకు విరాళాలు సేకరించారు. మాజీ సర్పంచ్ ఓరగంటి పెంటన్న, ఉప సర్పంచ్ తోకల చిన్న రాజన్న, అశోక్, విజయ్, లతీఫ్, స్వామి, వెంకటేశ్ పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

కైలాస్‌నగర్: షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన చెక్కులను బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తలమడుగు మండల కన్వీనర్ తోట వెంకటేశ్, భీంపూర్ కన్వీనర్ నాగయ్య, సొంపల్లి ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం సోషల్ మీడియా కన్వీనర్, కోకన్వీనర్ల నియామకం

నేరడిగొండ: బీజేవైఎం మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా గుత్పాల గ్రామానికి చెందిన ఊడుగుల అభిలాష్, కోకన్వీనర్‌గా రాథోడ్ ప్రవీణ్‌లను నియమించడం జరిగిందని మండల బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు బాక్రే లక్ష్మణ్ తెలిపారు. కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించడం కేవలం బీజేపీలోనే సాధ్యమన్నారు.

పరామర్శ

ఇంద్రవెల్లి: మండలంలోని ఈశ్వర్‌నగర్ గ్రామానికి చెందిన మీనాబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్ బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఈశ్వర్‌నగర్ గ్రామానికి సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ వైస్ ఎంపీపీ ధవులే బాలాజీ, ధరణి రాజేష్, నారాయణ, దేవిదాస్, అంజద్‌ఖాన్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

నేరడిగొండ: సెల్‌ఫోన్ చోరీకి గురైతే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని నేరడిగొండ ఎస్సై సాయన్న అన్నారు. చోరీకి గురైన ఫోన్‌ను రెండు రోజుల్లోనే స్వాధీనం చేసుకొని శుక్రవారం బాధితుడికి అందజేశారు. మండల కేంద్రంలోని మథుర నగర్ కాలనీకి చెందిన భగవాన్‌సింగ్ ఫోన్ గత రెండు రోజుల క్రితం చోరీకి గురైంది. దీంతో ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్‌కు సంబంధించిన వివరాలను నమోదు చేసి ఫోన్ స్వాధీనం చేసుకొని బాధితుడికి అందజేశారు.

దంతాలను సంరక్షించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: దంతాలను సంరక్షించుకోవాలని దంత వైద్యుడు శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో జనవిజ్ఞాన్ వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను శుక్రవారం సందర్శించారు. విద్యార్థులు దంతాల రక్షణ కోసం జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్, కోశాధికారి శ్రీధర్‌బాబు, గంగన్న, శ్రీనివాస్, మెస్రం రాజు, వినోద్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్

నార్నూర్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో బీఆర్‌ఎస్ శిక్షణ తరగతులకు సీఎం కేసీఆర్ హాజరయ్యారు. శుక్రవారం మాజీ ఎంపీ నగేశ్‌తో కలిసి సీఎం కేసీఆర్‌ను కలిశారు. జిల్లా సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.